సాక్షి నంద్యాల

మంగళవారం ၊ 25 ၊ జూన్ ၊ 2024



మల్లన్నకు నృత్య నీరాజనం

శ్రీశైలంటెంపుల్: ధర్మపథం కార్యక్రమంలో భాగంగా నిత్యకళావేదికపై హైదరాబాద్‌కు చెందిన సత్య కీర్తి నృత్యధామం బృందం ప్రదర్శించిన సంప్రదాయ నృత్యం భక్తులను ఆకట్టుకుంది.



మల్లన్నకు సహస్రదీపార్చన సేవ

శ్రీశైలంటెంపుల్: భ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్లకు సోమవారం దేవస్థానం సహస్రదీపార్చన సేవను నిర్వహించింది. వెయ్యి దీపాలను వెలిగించి, ప్రత్యేక పూజాదికాలు నిర్వహించారు.



ట్రాఫిక్ ఫ్రీజోన్‌గా శ్రీశైలం

శ్రీశైల ఆలయ పరిసర ప్రాంతాలను దేవస్థాన అధికారులు ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. 8లో▸

లెక్క తప్పిన 'మద్దతు'

రైతుల్లో తీవ్ర అసంతృప్తి

- అశాస్త్రీయంగా మద్దతు ధరలను ప్రకటించిన కేంద్రం
- భారీగా పెరిగిపోయిన పెట్టుబడి వ్యయం
- వ్యవసాయ శాఖ నివేదికను పరిగణనలోకి తీసుకోని వైనం
- మొక్కజొన్నలో క్వింటా పండించేందుకు అవుతున్న ఖర్చు రూ.2318
- మద్దతు ధర రూ.2,225 మాత్రమే
- ఈ ధరతో అమ్ముకుంటే రైతులకు దక్కేది శూన్యం
- పునఃసమీక్ష చేయాలంటున్న రైతు సంఘాల నేతలు

ఉమ్మడి కర్నూలు జిల్లాలో మొక్కజొన్న ప్రధాన పంట. భూమి చదును చేసుకోవడం, విత్తనాలు, ఎరువులు, పురుగు మందులు, సేద్యం ఖర్చులు, లేబర్ చార్జీలు ఇలా అన్ని రకాల ఖర్చులు కలిపి వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం హెక్టారుకు కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ రూ.57,949(మొత్తం పెట్టుబడి వ్యయం) ఉంటుంది. హెక్టారుకు దిగుబడి 25 క్వింటాళ్ల వరకు వస్తుందని వ్యవసాయ యంత్రాంగం చెబుతోంది. అంటే క్వింటా మొక్కజొన్న పండించడానికి రైతుకు అవుతున్న ఖర్చు రూ.2,318. అయితే కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి మొక్కజొన్నలో క్వింటాకు ప్రకటించిన కనీస మద్దతు ధర రూ.2,225 మాత్రమే. ఈ ధరతో అమ్మకుంటే పెట్టిన పెట్టుబడి కూడా దక్కని పరిస్థితి.

కర్నూలు(అగ్రికల్చర్): ఇటీవల కేంద్ర ప్రభుత్వం 2024–25 సంవత్సరానికి వివిధ పంటలకు ప్రకటించిన కనీస మద్దతు ధర రైతులను నిరాశకు గురి చేస్తోంది. వ్యవసాయంలో ఏడాదికేడాది పెట్టుబడి వ్యయం పెరుగుతోంది. అందుకు అనుగుణంగా కేంద్ర ప్రభుత్వం మద్దతు ధరలను సవరించాల్సి ఉంది. మద్దతు ధరలు లేకపోతే దళారీలు చెప్పిందే ధర అయ్యే ప్రమాదం ఉంది. వేలాది రూపాయలు పెట్టుబడులు పెట్టి రేయింబవళ్లు కష్టించి పండించిన పంటలను దళారీలు కొల్లగొట్టే అవకాశం లేకపోలేదు. రైతులు దళారీల బారిన నష్టపోరాదనే ఉద్దేశంతోనే కేంద్రం ప్రతి ఏటా పెట్టుబడి వ్యయాన్ని పరిగణనలోకి తీసుకొని మద్దతు ధరలను ప్రకటిస్తోంది. 2024–25 సంవత్సరానికి పండించే పంటలకు కేంద్రం మద్దతు ధరలను సవరించింది. వివిధ పంటలకు ఉన్న కాస్ట్ ఆఫ్ కల్టివేషన్‌ను పరిశీలిస్తే కేంద్రం ప్రకటించిన మద్దతు ధరలు రైతులకు అసంతృప్తినే మిగిల్చినట్లు స్పష్టమవుతోంది. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రధానంగా వరి, పత్తి, మొక్కజొన్న, వేరుశనగ, కంది, మినుము, జొన్న సాగు చేస్తారు. ఏ పంటకు చూసినా కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ భారీగా ఉంది. వ్యవసాయ యంత్రాంగం పంటల వారీగా కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ లెక్కించి హెక్టారుకు ఎంత ఖర్చు వస్తుంది.. దిగుబడి ఎంత.. ఒక క్వింటా ఉత్పత్తికి అయ్యే ఖర్చు ఎంత అనే వివరాలును శాస్త్రీయంగా లెక్కించి పంపుతుంది. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్‌ను పరిగణనలోకి తీసుకొని మద్దతు ధరలు ప్రకటిస్తే రైతులకు న్యాయం జరుగుతుంది. అయితే ఆ దిశగా కేంద్రం ఆలోచించకపోవడం గమనార్హం.

మద్దతు ధర ఆందోళన కలిగిస్తోంది



పత్తి, కంది, వరి తదితర అన్ని పంటల్లో పెట్టుబడి వ్యయం భారీగా పెరిగింది. పత్తి సాగులో హెక్టారుకు రూ.లక్ష వరకు పెట్టుబడి వ్యయం వస్తోంది. దిగుబడి 12–14 క్వింటాళ్లు మాత్రమే ఉంటోంది. కేంద్ర ప్రభుత్వం పత్తి పంటకు గత ఏడాది మద్దతు ధర రూ.501 మాత్రమే పెంచి రూ.7,020 చేసింది. ఈ ధరతో అమ్ముకుంటే పెట్టుబడి కూడా దక్కదు. మాకు 20 ఎకరాల భూమి ఉంది. ప్రధానంగా పత్తి, కంది సాగు చేస్తున్నాం. వీటి మద్దతు ధరలు నిరాశాజనకంగా ఉండటం ఆందోళన కలిగిస్తోంది.

– గౌర మహేశ్వరరెడ్డి, ఏ.గోకులపాడు, కల్లూరు మండలం



2023-24లో మద్దతు ధరతో కొనుగోలు చేస్తున్న దృశ్యం (ఫైల్)

మద్దతు అంతంతే..

ఉమ్మడి కర్నూలు జిల్లాలో వరి ప్రధాన ఆహారపు పంట. ఈ పంటలో పెట్టుబడి వ్యయం ఏడాదికేడాది పెరుగుతోంది. కానీ మద్దతు ధరను రూ.117 మాత్రమే పెంచడం పట్ల నిరుత్సాహం వ్యక్తమవుతోంది. కనీస మద్దతు ధర రూ.2,500 పైన పెంచి ఉంటే ధాన్యం రైతుకు కొంతమేర న్యాయం జరిగేదనే వాదన వినిపిస్తోంది. మిగిలిన పంటలదీ ఇదే పరిస్థితి.

పెట్టుబడి వ్యయం ఇలా..

వ్యవసాయ శాఖ లెక్కల ప్రకారం వరికి కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ హెక్టారుకు రూ.1,07.896 ఉంది. జొన్నకు రూ.67,284, పత్తిలో రూ.82,923, కందిలో రూ.56,075, పెసరలో రూ.70,016, మినుములో రూ.70,016, సజ్జలో రూ.33,784, మొక్కజొన్నలో రూ.57,949, పొద్దుతిరుగుడులో రూ.55,500, కొర్రలో రూ.27313 ప్రకారం పెట్టుబడి వ్యయం ఉంటోంది. నిజానికి అన్ని పంటలపై పెట్టుబడి వ్యయం ఇంకా భారీగానే ఉంటోంది. వరిలో క్వింటా ధాన్యం పండించడానికి రూ.1,962 ఖర్చు వస్తుంది. కేంద్రం మద్దతు ధర ఏ గ్రేడ్‌కు రూ.2,320, సాధారణ రకాలకు రూ.2,300 ప్రకటించింది. ప్రతి ఏటా రైతులు పండించిన ధాన్యానికి ధర లభించక తీవ్రంగా నష్టపోతున్నారు. మార్కెట్‌లో గిట్టుబాటు ధరలు లేనప్పుడు కేంద్రం ప్రకటించిన మద్దతు ధరతో వరి ధాన్యం అమ్ముకుంటే హెక్టారుకు పండే 55 క్వింటాళ్లకు రూ.1,27,600 వస్తుంది. కాస్ట్ ఆఫ్ కల్టివేషన్ (పెట్టుబడి వ్యయం) మినహాయిస్తే రైతుకు లభించే నికర ఆదాయం రూ.18,704 మాత్రమే.

క్వింటాకు సవరించిన మద్దతు ధరలు (రూ.ల్లో)

పంట	2023–24 మద్దతు ధరలు	2024–25 మద్దతు ధరలు
పత్తి(పొడుగురకం)	7,020	7,521
పత్తి (మధ్యరకం)	6,620	7,121
వరి(గ్రేడ్–ఏ)	2,203	2,320
వరి (కామన్ రకం)	2,183	2,300
జొన్న హైబ్రీడ్	3,180	3,371
జొన్న(మాల్దండి)	3,225	3,421
సజ్జ	2,500	2,615
రాగులు	3,846	4,290
మొక్కజొన్న	2,090	2,225
కంది	7,000	7,550
పెసర	8,558	8,682
మినుము	6,950	7,400
వేరుశనగ	6,377	6,783
పొద్దుతిరుగుడు	6,760	7,280
సోయాబీన్(పచ్చ)	4,600	4,892
నువ్వులు	8,635	9,267

మద్దతు ధరలు నిరాశాజనకం



కేంద్రం మద్దతు ధరలను అశాస్త్రీయంగా ప్రకటించినట్లు కనిపిస్తోంది. ఇలా అన్ని పంటల్లో పెట్టుబడి వ్యయం గణనీయంగా పెరిగింది. అందుకు అనుగుణంగా మద్దతు ధరలు లేకపోవడం ఆందోళన కలిగించే విషయం. వరికి హెక్టారుకు పెట్టుబడి వ్యయం రూ.1.10 లక్షల వరకు ఉంటోంది. మద్దతు ధర కనీసం రూ.2,600 నుంచి రూ.3వేల వరకు ఉండాలి. జిల్లాలో పత్తి ప్రధాన వాణిజ్య పంట. అలాంటిది మద్దతు ధర రూ.7,521 మాత్రమే నిర్ణయించడం ఎంతవరకు సమంజసం.

– జి.రామకృష్ణ, జిల్లా ప్రధాన కార్యదర్శి, ఏపీ రైతు సంఘం, కర్నూలు

న్యూస్‌రీల్

అడవిలోకి వెళ్లొద్దు



వజ్రాన్వేషకులతో మాట్లాడుతున్న ఎఫ్‌బీఓ

రుద్రవరం: అడవి లోకి వెళ్లి ప్రమాదాల బారిన పడొద్దని ఎఫ్‌బీఓ నాగప్ప వజ్రాన్వేషకులను హెచ్చరించారు. మండల పరిధిలోని అప్పనపల్లె, గోనంపల్లె, పెద్దకంబలూరు, డి.శ్రీరంగాపురం, డికొట్టాల గ్రామాలతో పాటు చుట్టు పక్కల గ్రామాల ప్రజలు వర్షాకాలంలో వజ్రాల అన్వేషనకు సమీప అటవీ ప్రాంతంలో ఉన్న తెలుగుగంగ ప్రధాన కాల్వ కట్టపైకి చేరుతున్నారు. కొందరు ట్రాక్టర్లు, మోటార్ సైకిళ్లమీద అక్కడికెళ్లి కట్టపై, తెలుగుగంగ కాల్వ వంతెనపై పార్క్ చేసి పరిసర ప్రదేశాల్లో తమ అదృష్టాన్ని పరీక్షించుకుంటున్నారు. కొద్ది రోజులుగా వారు అడవి వైపు ఉన్న తెలుగుగంగ కాల్వ రెండో కట్ట మీద వజ్రాలను అన్వేషిస్తున్నారు. సోమవారం కట్ట అవతలి వైపు ట్రాక్టరు, మోటార్ సైకిల్‌పై వచ్చిన వారిని ఎఫ్‌బీఓ నాగప్ప గమనించి విచారించారు. వజ్రాల కోసం వచ్చినట్లు తెలుసుకుని మందలించారు. అడవిలో వన్య ప్రాణులతో పాటు ప్రమాదకర జంతువులు తిరుగాడుతున్నాయని, వారి బారిన పడితే ఇబ్బందులు పడతారని, మరోసారి వస్తే వాహనాలను సీజ్ చేస్తామని హెచ్చరించి పంపించేశారు.

మరో రెండు అతిసారం కేసులు



మహిళలకు వైద్యం అందిస్తున్న ఆరోగ్య సిబ్బంది

జూపాడుబంగ్లా: మండలంలోని చాబోలు గ్రామంలో ఐదురోజులైనా అతిసారం వ్యాధి తగ్గుముఖం పట్టకపోగా సోమవారం కొత్తగా రెండు కేసులు నమోదయ్యాయి. గ్రామానికి చెందిన మరియమ్మ, సాలమ్మ అతిసార వ్యాధి బారిన పడగా వారికి గ్రామంలోని వైద్యశిబిరంలో చికిత్స అందించారు. వారు కాస్త కోలుకోవటంతో ఇంటికి పంపించి వైద్య సిబ్బంది వారి ఆరోగ్యస్థితిపై వైద్యులు మోహన్, గంగాధర్ పర్యవేక్షిస్తున్నారు. హెల్త్‌సూపర్‌వైజర్లు రాముడు, విజయలక్ష్మమ్మ ఆరోగ్య, ఆశవర్కర్లు ఇంటింటికి వెళ్లి గ్రామస్తుల ఆరోగ్యస్థితిగతులపై ఆరా తీస్తున్నారు. కాచివడగట్టిన నీటిని తాగాలని గ్రామస్తులకు సూచించటంతో పాటు వారికి క్లోరిన్, ఓఆర్ఎస్ ప్యాకెట్లను పంపిణీ చేస్తున్నారు. అతిసార వ్యాధి పూర్తిగా తగ్గుముఖం పట్టే వరకు గ్రామంలో వైద్యశిబిరం కొనసాగుతుందని హెల్త్‌సూపర్‌వైజర్ రాముడు తెలిపారు.


ఫిర్యాదులకు ఎప్పటికప్పుడే పరిష్కారం చూపండి



ఫిర్యాదులు స్వీకరిస్తున్న ఎస్పీ

బొమ్మలసత్రం: ప్రజల నుంచి వచ్చే ఫిర్యాదులకు ఎప్పటికప్పుడే పరిష్కారం చూపాలని ఎస్పీ కె రఘువీర్‌రెడ్డి పోలీస్ అధికారులను ఆదేశించారు. స్థానిక కార్యాలయంలో నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక కార్యక్రమంలో ఆయన ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిచారు. బాధితుల నుంచి సమస్యలను విని వీలైనంత త్వరగా పరిష్కారం చూపుతామని చెప్పి పంపారు. అనంతరం ఆయన పోలీస్ అధికారులతో మాట్లాడుతూ ఫిర్యాదులను పరిశీలించి చట్టపరిధిలో పరిష్కరించాలని సూచించారు. సమావేశంలో ఎస్‌బీ సీఐ రవీంద్ర, సీసీ నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ దాడులను అరికట్టండి



ఎస్పీకి వినతిపత్రం అందజేస్తున్న జెడ్పీ చైర్మన్

బొమ్మలసత్రం: జిల్లాలో వైఎస్సార్‌సీపీ నాయకులు, సామాన్యులపై టీడీపీ నాయకులు చేస్తున్న దాడులను అరికట్టాలని జెడ్పీ చైర్మన్ ఎర్రబోతుల పాపిరెడ్డి జిల్లా ఎస్పీ కె రఘువీర్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. అనంతరం జెడ్పీ చైర్మన్ విలేకరులతో మాట్లాడుతూ టీడీపీ నాయకులు విచ్చలవిడిగా వైఎస్సార్‌సీపీ నాయకులపై, సామాన్యుల ఆస్తుల ధ్వంసానికి పాల్పడుతున్నారన్నారు. టీడీపీ విషసంస్కృతిని ఆపాలని, పోలీసులు బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఎస్పీని కోరామన్నారు. అధికారం వచ్చిన తర్వాత రాష్ట్రాన్ని అభివృద్ధి చేసే పనిలో ప్రభుత్వాలు ఉండాలే తప్ప దాడులను ప్రోత్సహించటం సరికాదన్నారు.

నిబంధనలు పాటించకపోతే గుర్తింపు రద్దు చేస్తాం

సాక్షి ఎఫెక్ట్

ఆళ్లగడ్డ: నిబంధనలు పాటించని ప్రైవేటు పాఠశాలల గుర్తింపు రద్దు చేస్తామని ఎంఈఓ శోభావివేకవతి హెచ్చరించారు. సోమవారం 'సాక్షి'లో ప్రైవేటు పాఠశాలల ఆగడాలపై ప్రచురితమైన 'బడిలో బిజినెస్' కథనానికి విద్యాశాఖ స్పందించింది. జిల్లా విద్యాశాఖాధికారుల ఆదేశాల మేరకు ఎంఈఓ పలు ప్రైవేట్ పాఠశాలలను తనిఖీ చేశారు. సెంటాన్స్ పాఠశాలలో విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన పుస్తకాలను గుర్తించి ఆగ్రహం వ్యక్తం చేశారు. అడ్మిషన్ల కోసం వచ్చిన తల్లిదండ్రులతో మాట్లాడి ఫీజు, పుస్తకాల బిల్లులు పరిశీలించి వివరాలు సేకరించారు. వీటిని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని ఎంఈఓ తెలిపారు. ఏ ప్రైవేటు పాఠశాల అయినా ప్రభుత్వం ముద్రించిన పాఠ్యపుస్తకాలు తీసుకోవాలన్నారు. పాఠశాలల్లో నోట్ పుస్తకాలు, ఇతర సామగ్రి విక్రయించరాదన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరించిన వారిపై కఠిన చర్యలు తప్పవన్నారు.



సెంటాన్స్ పాఠశాల నిర్వాహకులను హెచ్చరిస్తున్న ఎంఈఓ

రాయితీ విత్తన పంపిణీ 70 శాతం పూర్తి

నంద్యాల(సెంట్రల్): జిల్లా వ్యాప్తంగా ఖరీఫ్‌కు సంబంధించి రాయితీ విత్తన పంపిణీ 70 శాతం పూర్తయినట్లు డీఏఓ మురళీకృష్ణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. వేరుశనగ 4,271 క్వింటాళ్లకు గానను 3,003.60 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు. ఈనెలాఖరుకు వేరుశనగ పంపిణీ ప్రక్రియను పూర్తి చేస్తామన్నారు. 50 శాతం రాయితీతో జనుము, జీలుగ, పిల్లిపెసర తదితర పచ్చిరొట్ట విత్తనాలు, రాగులు, కొర్రలు, 30 శాతం రాయితీతో కందులు, మినుములు, పెసర విత్తన పంపిణీ కొనసాగుతోందన్నారు. ఇప్పటి వరకు అన్ని రకాల విత్తనాలు కలిపి 9201.50 క్వింటాళ్లకు గానూ 6,444.74 క్వింటాళ్లు పంపిణీ చేశామన్నారు.

సమస్యల పరిష్కారంపై దృష్టి పెట్టాలి

- జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు

నంద్యాల: సమస్యల పరిష్కారంపై దృష్టి సారించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సెంటినరీ హాల్‌లో ఏర్పాటు చేసిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో పాల్గొన్నారు. జాయింట్ కలెక్టర్ రాహుల్ కుమార్ రెడ్డి, డీఆర్ఓ పద్మజతో కలిసి ఆయన జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలను స్వీకరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ అధికారులతో మాట్లాడుతూ ప్రతి అర్జీని పరిశీలించి నిర్ణీత గడువులోగా పరిష్కరించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను కూడా వెంటనే పరిష్కరించాలన్నారు.

వినతుల్లో కొన్ని..

- తనకు 1.56 ఎకరాల వ్యవసాయ భూమి ఉన్నా పీఎం కిసాన్ రైతు భరోసా పథకం డబ్బు పడటం లేదని, విచారించి డబ్బు పడేలా చూడాలని అవుకు మండలం చెన్నంపల్లె గ్రామానికి చెందిన పుల్లమ్మ కలెక్టర్‌కు విన్నవించుకున్నారు.
- సర్వే నంబర్ 35/ఏలో 5.08 ఎకరాల పొలానికి డీ– పట్టా ఉందని, అయితే ఆన్‌లైన్‌లో ఈ–పాస్ పుస్తకం రాలేదని, విచారించి ఆన్‌లైన్ చేయించి ఈ పాసుపుస్తకం ఇప్పించాలని ఆత్మకూరు మండలానికి చెందిన ఫిరోజ్ బాషా జిల్లా కలెక్టర్‌కు దరఖాస్తు సమర్పించుకున్నారు.



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్, జేసీ

వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలి

నంద్యాల టౌన్: వ్యాధులపై ప్రజలకు అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ శ్రీనివాసులు అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక సెంట్రింగ్ హాల్‌లో కీటక జనిత వ్యాధుల నియంత్రణ నిర్వహణ గురించి వివిధ శాఖల అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ఖాళీ ప్రదేశాల్లో నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఫాగింగ్ స్ప్రేయింగ్ తప్పనిసరిగా చేయాలన్నారు. వైద్యాధికారులు, పంచాయతీ శానిటేషన్ అధికారులు సమన్వయంతో మలేరియా, డెంగీ తదితర వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో జిల్లా వైద్యాధికారి డాక్టర్ వెంకటరమణ మలేరియా అధికారి కామేశ్వరరావు పాల్గొన్నారు.

మల్లన్న దర్శనానికి పోటెత్తిన భక్తులు

శ్రీశైలంటెంపుల్: శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తులు పోటెత్తారు. సోమవారం ఉభయ తెలుగు రాష్ట్రాల నుంచే కాకుండా ఇతర రాష్ట్రాల నుంచి సైతం భక్తులు వేలాదిగా తరలివచ్చారు. వేకువజామునే పాతాళగంగలో పుణ్యస్నానాలు ఆచరించిన భక్తులు.. ఉచిత, శీఘ్ర, అతిశీఘ్ర దర్శన క్యూలైన్ల ద్వారా స్వామిఅమ్మవార్లను దర్శించుకున్నారు. పలువురు భక్తులు మల్లన్నకు గర్భాలయ, సామూహిక అభిషేకం, అమ్మవారికి కుంకుమార్చన తదితర ప్రత్యేక పూజలు నిర్వహించుకున్నారు. సర్వ దర్శనానికి 4 గంటలు, శీఘ్ర దర్శనానికి 2 గంటల సమయం పట్టింది. క్యూలైన్లలో వేచివున్న భక్తులకు ఎటువంటి ఇబ్బందులు లేకుండా దేవస్థాన అధికారులు ఏర్పాట్లు చేశారు.



దర్శనానికి క్యూలైన్లలో బారులు తీరిన భక్తులు

ఉచిత కంపార్ట్‌మెంట్లలో వేచివున్న భక్తులకు తాగునీరు, అల్పాహారం, బిస్కెట్లు పంపిణీ చేశారు. భక్తుల రద్దీతో క్షేత్ర పురవీధులన్ని కిటకిటలాడాయి.

పశు వైద్యం.. పరిపుష్టి

- పాడికి వెన్ను రైతుకు దన్ను
- మూగజీవాలకు బాసటగా డాక్టర్ వైఎస్సార్ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు
- సత్వరమే వ్యాధి నిర్ధారణ పరీక్షలు.. చికిత్సలే లక్ష్యంగా ల్యాబ్‌ల్లో సేవలు
- జిల్లాలో ఇప్పటి వరకు 29,257 పుశువులకు 34,969 రకాల నమూనాలకు పరీక్షలు
- సత్ఫలితాలిస్తున్న పశువుల ల్యాబొరేటరీలు

ఆళ్లగడ్డ: పశు–జీవ ఆరోగ్య పరిరక్షణే ధ్యేయంగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన డాక్టర్ వైఎస్సార్ నియోజకవర్గ పశు వ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలు సత్ఫలితాలిస్తున్నాయి. నియోజకవర్గానికి ఒకటి చొప్పున జిల్లాలో మొత్తం 7 ల్యాబ్‌లను ఏర్పాటు చేశారు. నియోజకవర్గ స్థాయి పశు సంవర్థకశాఖ అధికారుల (ఏడీ) పర్యవేక్షణలో ల్యాబ్ టెక్నీషియన్లు ల్యాబ్‌లను నిర్వహిస్తున్నారు. ప్రతి ల్యాబ్‌కు టెక్నీషియన్‌తో పాటు అసిస్టెంట్ టెక్నీషియన్, అటెండర్‌ను నియమించారు. జిల్లాలో ఇప్పటి వరకు 29,257 పశువులకు సంబంధించి 34,968 నమూనాలను సేకరించి పరీక్షించారు. సకాలంలో వ్యాధులు గుర్తించి, చికిత్స అందిస్తుండటంతో పశువుల మరణాలు తగ్గి పశు సంపద వృద్ధి చెందుతోంది.



గొర్రెలకు చికిత్స చేస్తున్న పశువైద్యాధికారిణి(ఫైల్)

నాడు కర్నూలులోనే..

పశువులకు సోకిన వ్యాధి నిర్ధారణ చేసుకోవాలంటే గతంలో ఉమ్మడి జిల్లా కేంద్రం కర్నూలులో మాత్రమే ప్రయోగశాల ఉండేది. గ్రామీణ ప్రాంతాల్లో పశు వైద్య సిబ్బంది పశువులకు వైద్యం చేస్తున్నప్పటికీ అందుబాటులో ప్రయోగశాలలు లేక పోవడంతో సుదూర ప్రాంతాల్లోని గ్రామీణ పశుపోషకులు తమ పశువుల నమూనాలను సేకరించుకుని అక్కడికి వెళ్లి పరీక్షలు చేయించుకుని వ్యాధి నిర్ధారణ చేసుకుని రిపోర్ట్ వచ్చేలోపు పశువులు మృత్యువాత పడేవి. ఫలితంగా పాడి రైతులు ఆర్థికంగా నష్టపోయేవారు.



నమూనాలను పరీక్షిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్

నేడు స్థానికంగానే..

ఉమ్మడి జిల్లాలోని 14 నియోజవర్గాలకు కలిపి ఒక ల్యాబ్ ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం నియోజవర్గానికి ఒకటి చొప్పున రూ.32 లక్షల వ్యయంతో జిల్లాలో 7 పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలను ఏర్పాటు చేసింది. అందులో అధునాతన పద్ధతులతో ల్యాబ్ నిర్మించి వ్యాధి నిర్ధారణ పరీక్షా పరికరాలను, అత్యాధునిక యంత్రాలను అందుబాటులోకి తీసుకువచ్చింది. పల్లెల్లోనే పశు – జీవాలకు సోకిన, సోకబోయే వ్యాధులకు తక్షణమే నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తూ తక్షణ చికిత్స అందిస్తుండటంతో పశుపోషకులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

ఇక్కడ గొర్రె కళేబరం నుంచి నమూనాలు సేకరిస్తున్నది ఏడీఏ కొండారెడ్డి. నెల రోజుల క్రితం ఓబులంపల్లె గ్రామానికి చెందిన ఒక్కపేళ్ల ఇమాంహుస్సేన్ 50 గొర్రెలు అస్వస్థతకు గురయ్యాయి. నిమిషాల్లోనే ఓ గొర్రె మృతిచెందింది. ఇమాంహుస్సేన్ 1962 ఫోన్ చేయడంతో డాక్టర్ శ్రీకళ, టెక్నీషియన్‌తో అక్కడికి చేరుకుని వైద్యం అందించినప్పటికీ పరిస్థితి అదుపులోకి రాలేదు. అంతలో మరిన్ని గొర్రెలు మృత్యువాత పడ్డాయి. వెంటనే మృతి చెందిన ఓ గొర్రె కళేబరాన్ని ల్యాబ్‌కు తరలించి పోస్టుమార్టం నిర్వహించి పరీక్షించగా విషపు ఆహారం (జొన్న నాము) తిన్నట్లు నిర్ధారించి మిగతా వాటికి విరుగుడు మందు ఇవ్వడంతో బతికిపోయాయి.



పాడి పశువుల వద్ద నిలబడిన వృద్ధురాలు దొర్నిపాడు మండలం గుండుపాపల గ్రామానికి చెందిన తలారి సుబ్బలక్ష్మమ్మ. ఈమె పాడి గేదె అస్వస్థతకు గురి కావడంతో ఆర్బీకే పశువైద్య సహాయకుడి దృష్టికి తీసుకెళ్లింది. ఆయన పశువు రక్త నమూనాను సేకరించి ఆళ్లగడ్డ డాక్టర్ వైఎస్ఆర్ పశువ్యాధి నిర్ధారణ ప్రయోగశాలలో పరీక్ష చేయించగా న్యాసల్ సిస్టో జూమియా సిస్ (కుందేటి వెర్రి) సోకిందని నిర్ధారించి మందులు ఇవ్వడంతో పశువు రెండు రోజుల్లో తేరుకుంది.





సేవలన్నీ ఉచితం

గతంలో ల్యాబొరేటరీలు లేక ముందు శాంపిల్స్‌ను వ్యాధి నిర్ధారణ పరీక్షకు కర్నూలు పంపించాల్సి వచ్చేది. ఫలితాల కోసం రోజుల తరబడి ఎదురుచూడాల్సి వచ్చేది. ఇప్పుడు ల్యాబ్‌లు అందుబాటులోకి రావడంతో సకాలంలో పరీక్షలు నిర్వహించి గంటల వ్యవధిలోనే వైద్య సేవలు అందిస్తున్నాం. ఈ సేవలన్నీ పూర్తిగా ఉచితం. అందరూ సద్వినియోగం చేసుకోవాలి.

– డాక్టర్ గోవింద నాయక్

క్లుప్తంగా

దొంగ అరెస్ట్


దొంగను అరెస్ట్ చూపుతున్న పోలీసులు

కౌతాళం: దొంగలించిన సొమ్మును కౌతాళం పోలీసులు 24 గంటల్లో పట్టుకున్నారు. అలాగే దొంగను అరెస్ట్ చేశారు. మండల పరిధిలోని వల్లూరు గ్రామానికి చెందిన దేవన్నగౌడ్ కుటుంబ సభ్యులు ఇంటిపై నిద్రిస్తుండగా ఆదివారం తెల్లవారు జామున ఇంటి తలుపులు పగులగొట్టి ఇంట్లోకి ప్రవేశించి సుమారు ఐదు తులాల బంగారు ఆభరణాలు, రెండు సెల్ ఫోన్‌లను గుర్తు తెలియని వ్యక్తులు దొంగలించుకున్నట్లు దేవన్నగౌడ్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కోసిగి సీఐ ప్రసాద్ ఆధ్వర్యంలో ఎస్ఐ నరేంద్రకుమార్ రెడ్డి ప్రత్యేక టీం ఏర్పాటు చేసి ఆధునిక పరిజ్ఞానంను ఉపయోగించి దొంగను సోమవారం పట్టుకున్నారు. అదే గ్రామానికి చెందిన వాసయ్యగారి ఈరన్న ఈ దొంగతానికి పాల్పడినట్లు గుర్తించి అతని అరెస్టు చేసి అతని వద్ద నుంచి ఐదు తులాల బంగారు ఆభరణాలను, రెండు సెల్‌ఫోన్‌లను, నేరానికి ఉపయోగించిన ఇనుప రాడ్‌ను స్వాధీనం చేసుకున్నారు. తక్కువ సమయంలో కేసును ఛేదించిన పోలీసులను జిల్లా ఎస్పీ కృష్ణకాంత్, ఎమ్మిగనూరు ఇన్‌చార్జి డీఎస్పీ శివనారాయణస్వామి అభినందించారు.

నకిలీ బంగారు ఆభరణాలతో మోసం

కోవెలకుంట్ల: నకిలీ బంగారు ఆభరణాలతో ఓ ప్రైవేట్ బ్యాంకులో రుణం తీసుకుని మోసం చేసిన ఘటన కోవెలకుంట్లలో చోటు చేసుకుంది. సోమవారం ఎస్ఐ వరప్రసాద్ అందించిన సమాచారం మేరకు.. ఉయ్యాలవాడ మండలం మాయలూరు గ్రామానికి చెందిన లక్ష్మీనారాయణ, సంజామల మండలం పేరుసోములకు చెందిన అమీర్ నాలుగు నకిలీ బంగారు గాజులు తయారు చేసి కోవెలకుంట్లలోని ముత్తూట్ ఫిన్‌కార్ప్‌లో గత ఏడాది మే 23న రూ.1.73 లక్షలు గోల్డ్‌లోన్ తీసుకున్నారు. మరో నాలుగు నకిలీ బంగారు గాజులు తాకట్టు పెట్టి రూ.1.93 లక్షల రుణం తీసుకున్నారు. ప్రైవేట్ బ్యాంకు యాజమాన్యం తనిఖీ సమయంలో నకిలీ ఆభరణాలుగా గుర్తించారు. దీంతో మోసపోయామని భావించి బ్యాంకు మేనేజర్ మహబూబ్‌బాషా కోవెలకుంట్ల పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ట్రాఫిక్ ఫ్రీజోన్‌గా మల్లన్న క్షేత్రం

- శ్రీశైలంలో వాహనాల రద్దీ క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు
- ప్రధాన కూడళ్ల వద్ద బ్యారికేడ్ల ఏర్పాటు
- భక్తులకు ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్

శ్రీశైల ఆలయ పరిసర ప్రాంతాలను దేవస్థాన అధికారులు ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా ఏర్పాటు చేశారు. వాహనాల రద్దీని దృష్టిలో ఉంచుకుని క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. ఆలయ సమీపంలోని ప్రధాన కూడళ్ల వద్ద బారికేడ్లు ఏర్పాటు చేశారు. భక్తులకు ఇబ్బందులు లేకుండా వాహనాల పార్కింగ్‌కు ప్రత్యేక చర్యలు చేపట్టారు. – శ్రీశైలంటెంపుల్


శ్రీశైల ఆలయం


క్షేత్రంలో ప్రధాన కూడళ్లలో ఏర్పాటు చేసిన బ్యారికేడింగ్

శ్రీశైల మహాక్షేత్రంలో వెలసిన భ్రమరాంబా మల్లికార్జున స్వామిఅమ్మవార్ల దర్శనానికి భక్తుల రాక రోజురోజుకూ పెరుగుతోంది. సుదూర ప్రాంతాల నుంచి వచ్చే భక్తుల వాహనాలతో ఆలయ పరిసర ప్రాంతాలు రద్దీగా మారుతున్నాయి. ఒక్కోసారి క్యూలైన్ల వరకు కూడా వాహనాలు నిలుపుతుండటంతో కాలినడకన భక్తులకు ఇబ్బందులు ఇబ్బంది పడేవారు. పరిస్థితిని గమనించిన ఈఓ.. దేవస్థాన ఆస్పత్రి వరకు మాత్రమే వాహనాలను అనుమతించాలని అధికారులకు సూచించారు. అక్కడి నుంచి ఆలయం వరకు ట్రాఫిక్ ఫ్రీ జోన్‌గా ఏర్పాటు చేశారు. ఎవరైనా వృద్ధులు, చంటి పిల్లల తల్లులు, చిన్నారుల కోసం దేవస్థాన వైద్యశాల వద్ద ఉచిత బ్యాటరీ వాహనాన్ని ఏర్పాటు చేసి భక్తులను ఆలయ క్యూలైన్ల వద్దకు తీసుకెళ్లేలా చర్యలు తీసుకున్నారు.

వాహనాల రద్దీ క్రమబద్ధీకరణకు చర్యలు

క్షేత్ర పరిధిలోని దేవస్థాన వైద్యశాల కూడలి, విద్యుత్ శాఖ ఫ్యూజ్ ఆఫ్ కాల్ కార్యాలయం కూడలి, యాదవసత్రం, తదితర చోట్ల వాహనాల రద్దీ ఎక్కువగా ఉంటోంది. ఈ కూడళ్ల వద్ద వాహనాల క్రమబద్ధీకరణకు ఎప్పటికప్పుడు పకడ్బందీగా చర్యలు చేపడుతున్నారు.

బ్యారికేడ్ల ఏర్పాటుతో ట్రాఫిక్ క్రమబద్ధీకరణ

వారాంతపు సెలవురోజుల్లో, పర్వదినాల్లో వాహనాల రాకపోకలు అధికంగా ఉంటున్నాయి. దీంతో ముందస్తు ప్రణాళికతో బ్యారీ కేడ్లు ఏర్పాటు చేసి వాహనాల క్రమబద్ధీకరణకు ప్రత్యేక చర్యలు చేపట్టారు. టోల్‌గేట్, మల్లికార్జున సదన్ కూడలి, శివసతనం కూడలి, నందిసర్కిల్ కూడలి, దేవస్థాన వైద్యశాల కూడలి తదితర ప్రదేశాల్లో బ్యారికేడ్ల ఏర్పాటుతో ట్రాఫిక్ సమస్య పరిష్కారమైంది.

భక్తులకు ఇబ్బంది లేకుండా చర్యలు..

భక్తులకు ఇబ్బంది కలగకుండా ఆలయ పరిసరాల్లోకి వాహనాలు రాకుండా చర్యలు తీసుకున్నాం. నేను కూడా పరిపాలన కార్యాలయానికి క్యూలైన్ల మార్గంలో కాకుండా ఇతర మార్గంలో చేరుకుంటున్నాను. వాహనాల ట్రాఫిక్ సమస్య తలెత్తకుండా ప్రధాన కూడళ్ల వద్ద బ్యారికేడ్లు ఏర్పాటు చేశాం. తద్వారా క్షేత్ర పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్ సమస్య లేకుండా చేశాం. – డి.పెద్దిరాజు, శ్రీశైల దేవస్థాన కార్యనిర్వహణాధికారి


క్షేత్ర ప్రధాన కూడళ్ల వద్ద ట్రాఫిక్‌ను పరిశీలిస్తున్న ఈఓ

ముడుమలగుర్తిలో చోరీ

- రూ.3 లక్షలకు పైగా నగదు, 6 తులాల బంగారం అపహరణ


బీరువాలను పగులగొట్టిన దృశ్యం

కోడుమూరు రూరల్: మండల పరిధిలోని ముడుమలగుర్తి గ్రామంలో చోరీ జరిగింది. గ్రామానికి చెందిన రాధాక్రిష్టారెడ్డి కుటుంబ సభ్యులతో గత శనివారం ఇంటికి తాళం వేసి తిరుపతికి వెళ్లారు. ఇదే అదనుగా భావించిన దుండగులు ఆదివారం అర్ధరాత్రి దాటిన తర్వాత ఇంటికి వేసిన తాళాలను పగులగొట్టి చోరీకి పాల్పడ్డారు. ఉదయం ఇంటికి తాళాలు పగులగొట్టి ఉండటాన్ని గమనించిన చుట్టుపక్కల వాళ్లు కోడుమూరు పోలీసులకు, తిరుపతికి వెళ్లిన రాధాక్రిష్టారెడ్డికి సమాచారమందించారు. కోడుమూరు ఎస్ఐ బాలనరసింహులు ముడుమలగుర్తి గ్రామాన్ని చేరుకుని దొంగతనం జరిగిన తీరును పరిశీలించారు. రాధాక్రిష్టారెడ్డి కుమార్తెలు ఇంటికి వద్దకు చేరుకుని రెండు బీరువాల్లో ఉన్న సుమారు రూ.3లక్షలకు పైగా నగదు, ఆరు తులాల బంగారాన్ని అపహరించినట్లు గుర్తించారు. ఈ మేరకు పోలీసులకు ఫిర్యాదు చేశారు.

మంత్రి ఇలాఖాలోనే మైనారిటీలకు రక్షణ లేదు

- పట్టణ ప్రథమ పౌరురాలు, మైనారిటీ మహిళను దుర్భాషలాడటం తగదు
- ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా


మాట్లాడుతున్న ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా

బొమ్మలసత్రం: మంత్రి ఇలాఖాలోనే మైనారిటీలకు రక్షణ లేదని ఎమ్మెల్సీ ఇసాక్‌బాషా ఆవేదన వ్యక్తం చేశారు. పట్టణ ప్రథమ పౌరురాలు, మైనారిటీ మహిళ మాబున్నిసాను టీడీపీ నాయకులు దుర్భాషలాడినా మంత్రి ఎన్ఎమ్‌డీ ఫరూక్ స్పందించకపోవటం సిగ్గుచేటన్నారు. ఈనెల 22న 29 వార్డు సచివాలయంలో ముఖ్యమంత్రి, ఉపముఖ్యమంత్రి ఫొటోలు ఏర్పాటు చేసే సందర్భంగా టీడీపీ నాయకులు అక్కడే ఉన్న మున్సిపల్ చైర్‌పర్సన్ మాబున్నిసాను దుర్భాషలాడి బెదిరింపులకు పాల్పడ్డారు. అంతటితో ఆగక చైర్‌పర్సన్‌పైనే తప్పుడు కేసు నమోదు చేయించారు. దీంతో ఎమ్మెల్సీ ఇసాక్ బాషా, వైస్‌చైర్మన్‌లు, పట్టణ కౌన్సిలర్‌లు సోమవారం మాబున్నిసా ఇంటికి వెళ్లి బాసటగా నిలిచారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ మాట్లాడుతూ కొత్తగా ఏ ప్రభుత్వమైనా ముఖ్యమంత్రి చిత్రపటాలు ప్రభుత్వ కార్యాలయాల్లో ఏర్పాటు చేసేందుకు సమాచారశాఖకు సంబంధించిన అధికారులకు జీఓ పంపి ఏర్పాటు చేయటం ఆనవాయితీగా వస్తుందన్నారు. చిత్ర పటాల పరిమాణం, వాటి ఆకృతి ప్రభుత్వం ఆమోదించినదై ఉంటాయన్నారు. అయితే టీడీపీ నాయకులు నిబంధనలకు విరుద్ధంగా అత్యుత్సాహంతో వారే కార్యాలయాలకు వెళ్లి ఫొటోలు ఏర్పాటు చేయడం హాస్యాస్పదమన్నారు. ఇదే విషయాన్ని ప్రశ్నించిన మున్సిపల్ చైర్‌పర్సన్‌ను దూషించటం పద్ధతి కాదన్నారు. ఇల్లు ఖాళీ చేయకపోతే అంతుచూస్తామని బెదిరించటం ఎంత వరకు సబబు అని నిలదీశారు. జరిగిన అన్యాయాన్ని పోలీసులకు చెబితే సీఐ ముందే టీడీపీ నాయకులు ఏక వచనంతో సంబోధిస్తూ దూషించటం బాధాకరమన్నారు. న్యాయశాఖ మంత్రి సొంత నియోజకవర్గంలో అన్యాయాలకు పాల్పడుతున్నా.. ఆయన చూస్తూ మిన్నకుండిపోవడం సిగ్గుచేటన్నారు. ఇప్పటికైనా మంత్రి స్పందించి మైనారిటీ చైర్‌పర్సన్‌ను దూషించిన టీడీపీ నాయకులపై కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో వైస్‌చైర్మన్‌లు గంగిశెట్టి శ్రీధర్, పామ్‌షావలి, కౌన్సిలర్లు , వైఎస్సార్‌సీపీ నాయకులు పాల్గొన్నారు.

ధరల పెరుగుదలను నియంత్రించండి

- ధరల నియంత్రణ కమిటీ సమావేశంలో జేసీ టీ.రాహుల్‌కుమార్‌రెడ్డి
- రైతు బజార్లలో విక్రయాలు పెంచాలని సూచన


అధికారులకు సూచనలిస్తున్న జాయింట్ కలెక్టర్ టీ.రాహుల్ కుమార్‌రెడ్డి

నంద్యాల(సెంట్రల్): పెరుగుతున్న నిత్యావసరాల ధరలను నియంత్రించేందుకు సంబంధిత శాఖల అధికారులు చర్యలు చేపట్టాలని జాయింట్ కలెక్టర్ టీ.రాహుల్ కుమార్‌రెడ్డి సూచించారు. సోమవారం తన చాంబర్‌లో ధరల నియంత్రణ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జేసీ మాట్లాడుతూ..రైతులకు లాభదాయకంగా ఉండేలా, వినియోగదారులకు సరసమైన ధరలకు సరకులు లభించేలా సరఫరాదారులను గుర్తించాలని ఆదేశించారు. ఉద్యానశాఖ సమాచారం ప్రకారం స్థానిక రైతుల నుంచి కూరగాయల లభ్యత, ఎస్టేట్ అధికారులు/డ్వాక్రా సంఘాల ద్వారా రైతు బజార్లలో విక్రయాలపై సమగ్ర సమాచారం అందజేయాలన్నారు. సమీప హోల్‌సేల్ మార్కెట్లు, పొరుగు జిల్లాల నుంచి టమాట సేకరణ, ధర వివరాలపై నివేదిక తయారు చేయాలని చెప్పారు. నిర్దేశిత మార్గదర్శకాల ప్రకారం ఉద్యాన, పౌర సరఫరాలు, మార్కెటింగ్ అధికారులు బృందాలుగా ఏర్పడి తనిఖీలు చేయాలని, ఈ సందర్భంగా ఎదురయ్యే సమస్యలు, పరిష్కారాలతో నివేదిక అందజేయాలని సూచించారు. సమావేశంలో జిల్లా పౌర సరఫరాలు, మార్కెటింగ్, వ్యవసాయ, అనుబంధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

నిలకడగా ఎండుమిర్చి ధరలు

నంద్యాల(సెంట్రల్): ఎండుమిర్చి ధరలు నిలకడగా ఉన్నాయి. సోమవారం పట్టణంలోని టెక్కె మిర్చి యార్డులో సూపర్–10 రకం జనరల్ క్వింటాలు గరిష్ఠ ధర రూ.16,000, మధ్యస్థ ధర రూ.13,000, కనిష్ఠ ధర రూ.11,500గా నమోదైనట్లు యార్డు ఎంపికశ్రేణి కార్యదర్శి కల్పన ఓ ప్రకటనలో తెలిపారు.

ఒత్తిడి లేని చదువుకు ప్రణాళిక అవసరం


మాట్లాడుతున్న డాక్టర్ రమేష్‌బాబు

కర్నూలు(హాస్పిటల్): ఒత్తిడి లేని చదువుకు ప్రణాళిక అవసరమని మానసిక వైద్యులు బి.రమేష్ బాబు సూచించారు. సోమవారం కేంద్రీయ విద్యాలయంలో విద్యార్థులకు స్టడీ స్కిల్స్‌పై ఆయన పలు సూచనలు, సలహాలు అందించారు. రెండు నెలల వేసవి సెలవుల అనంతరం పాఠశాలకు రావడంతో ఎంతో ఉత్సాహం ఉంటుందని, అయితే తరగతి గదిలో చెప్పిన పాఠ్యాంశం ఏ రోజుకు ఆ రోజు మననం చేసుకుని చదువుకోవాలని సూచించారు. పరీక్షల సమయంలో అప్పటికప్పుడు చదివితే ఒత్తిడి పెరుగుతుందని, తద్వారా పరీక్షలు సరిగ్గా రాయక ఫెయిల్ అయ్యే అవకాశం ఎక్కువగా ఉంటుందని తెలిపారు. చదివిన విషయాలను సులభమైన పద్ధతులలో గుర్తుంచుకునే విధానాలను ఆయన సూచించారు. చదువుతో పాటు ఆటపాటలు, నిద్ర, మానసిక, శారీరక ఆరోగ్యం, సమతుల ఆహారం కూడా ముఖ్యమని చెప్పారు. వీటిని ఏ మాత్రం నిర్లక్ష్యం చేసినా అది చదువుపై పడుతుందని తెలిపారు. కార్యక్రమంలో పాఠశాల హెడ్‌మాస్టర్ పి. ప్రియదర్శిని, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

యువకుడి అనుమానాస్పద మృతి


బాబుప్రసాద్ మృతదేహం వద్ద రోదిస్తున్న కుటుంబ సభ్యులు

అవుకు: మండల కేంద్రం సమీపంలో అనుమానాస్పద స్థితిలో యువకుడు మృతి చెందిన ఘటన సోమవారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. అవుకు ఈబీసీ కాలనీకి చెందిన బాయకాటి బాబుప్రసాద్(20) పాలిస్ ఫ్యాక్టరీలో పనిచేస్తూ తల్లి వరలక్ష్మమ్మకు చేదోడుగా ఉన్నాడు. సోమవారం ఆరోగ్యం బాగోలేదని పనికి వెళ్లలేదు. స్నేహితునితో కలిసి చిన్న చెరువు కట్ట వద్దకు వెళ్లాడు. కట్ట వద్ద ఉన్న తూముపై దాదాపు 50 అడుగుల ఎత్తులో నుంచి కట్టకు పేర్చిన రాళ్లపై పడి రక్తపు మడుగులో ఉన్నాడు. 108 అంబులెన్స్‌కు సమాచారం అందటంతో వెళ్లి చూడగా అప్పటికే మృతి చెందినట్లు నిర్ధారించారు. విషయం తెలుసుకున్న తల్లి అక్కడికి చేరుకొని విగతజీవిగా పడిఉన్న కుమారుడి మృతదేహాన్ని చూసి బోరున విలపించింది. అంతకుముందు రోజు స్థలం విషయంలో అదే కాలనీకి చెందిన ఓ వ్యక్తితో గొడవ జరగడంతో అతడు అంతు చూస్తానని బెదిరించినట్లు సమాచారం. ఈ విషయమై మనస్తాపంతో తూముపై నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడా? లేక కాలు జారి కింద పడి మృతి చెందాడా? ఎవరైనా హత్య చేశారా అనేది పూర్తి స్థాయిలో విచారించాలని స్థానికులు కోరుతున్నారు. కాగా విషయం పోలీసులకు చేరవేసినా వారు త్వరగా రాకపోవడంతో యువకుడు మృతదేహం ఎండలోనే చాలా సేపు ఉండిపోయింది. పోలీసుల తీరుపై మృతుని కుటుంబసభ్యులు, స్థానికులు మండిపడ్డారు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కిరణ్ తెలిపారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి


గోనెగండ్లలో మురుగు కుంటను పరిశీలిస్తున్న మలేరియా రాయలసీమ జోన్ జేడీ త్యాగరాజు

గోనెగండ్ల: సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాయలసీమ జోనల్ జాయింట్ డైరెక్టర్ త్యాగరాజు సూచించారు. గోనెగండ్లలోని ఒకటవ సచివాలయం పరిధిలో మెదడు వ్యాపు వ్యాధి నమోదు కావడంతో మలేరియా విభాగం అధికారులు పర్యటిస్తూ ప్రజలను అప్రమత్తం చేస్తున్నారు. ఇందులో భాగంగా సోమవారం మలేరియా రాయలసీమ జోనల్ జేడీ త్యాగరాజు పర్యటించారు. మురుగు నీరు నిల్వ ఉన్న ప్రాంతాలను పరిశీలించి ఆరోగ్య సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మురుగు నీరు ఉన్న చోట దోమలు వృద్ధి చెందకుండా నివారణ మందు పిచికారీ చేయించాలని అధికారులకు సూచించారు. అలాగే వారానికి ఒకసారి స్ప్రేయింగ్, 15 రోజులకు ఒకసారి ఫాగింగ్ చేయాలన్నారు. ఇళ్లలో ఎక్కువ రోజులు నీటిని నిల్వ ఉంచుకోరాదని ప్రజలకు సూచించారు. చుట్టూ ఉన్న పరిసరాలను శుభ్రంగా ఉంచుకుంటే రోగాలు దరిచేరవన్నారు. జిల్లా అసిస్టెంట్ మలేరియా ఆఫీసర్ చంద్రశేఖర్, ల్యాబ్ టెక్నీషియన్లు, జిల్లా జేఈ టీమ్, పీఎహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.

వివాహిత ఆత్మహత్య


మృతదేహాన్ని పరిశీలిస్తున్న డోన్ డీఎస్పీ శ్రీనివాసరెడ్డి

బనగానపల్లె రూరల్: స్థానిక ఎరుకలిపేట కాలనీలో సీతామహాలక్ష్మి(22) కడుపు నొప్పి తాళలేక సోమవారం ఆత్మహత్యకు పాల్పడింది. కుటుంబ సభ్యులు, పోలీసులు తెలిపిన వివరాలు.. ప్యాపిలి మండలం ఎస్.రంగాపురం గ్రామానికి చెందిన సీతామహాలక్ష్మిని ఎరుకలిపేటకు చెందిన మునిస్వామికి ఇచ్చి మూడేళ్ల క్రితం వివాహం చేశారు. వీరికి ఏడాది చిన్నారి సంతానం కాగా, సీతామహాలక్ష్మి ప్రస్తుతం గర్భిణి. కొన్నేళ్లుగా కడుపు నొప్పి, నెలసరి సమస్యలతో సీతామహాలక్ష్మి బాధ పడుతోంది. వైద్యం చేయించుకున్నా నయం కాకపోవడంతో పాటు ఇటీవల నొప్పి తీవ్రం కావడంతో జీవితంపై విరక్తి చెంది, ఫ్యాన్‌కు ఉరివేసుకొని ఆత్మహత్యకు పాల్పడింది. విషయం తెలుసుకున్న సీఐలు గంటా సుబ్బారావు, తిమ్మారెడ్డి మృతురాలు ఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఏరియా వైద్యశాలకు తరలించారు.

డోన్ డీఎస్పీ శ్రీనివారెడ్డి ప్రభుత్వ వైద్యశాలకు చేరుకొని వివరాలను తెలుసుకున్నారు. మృతరాలి తల్లి సుంకమ్మ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ గంటా సుబ్బారావు తెలిపారు.

కోడుమూరులో సినీనటుడు సుమన్ సందడి


వేంకటేశ్వరస్వామి ఆలయం ఎదుట అభిమానులతో సుమన్

కోడుమూరు రూరల్: కోడుమూరులో సినీనటుడు సుమన్ సోమవారం సందడి చేశారు. పట్టణంలో పునర్నిర్మాణంలో ఉన్న పంచాయతన దేవతల సహిత శ్రీలక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయాన్ని హీరో సుమన్ సందర్శించారు. అనంతరం నాగార్జున విద్యానిలయానికి చెందిన విద్యార్థులతో కొద్దిసేపు ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అన్నమయ్య సినిమా చేయడం తన పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నానని తెలిపారు. తనకు కోడుమూరుతో ఏదో విడదీయరాని అనుబంధం ఉందని, తనను ఇక్కడి ప్రజలు ఎంతగానో అభిమానిస్తారని చెప్పారు. కోడుమూరులో పురాతన పద్ధతిలో పునఃనిర్మిస్తున్న లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం చరిత్రలో నిలిచిపోతుందని తెలిపారు. ఇంతటి మహా కార్యానికి పూనుకున్న దాత ఎద్దుల మహేశ్వరరెడ్డి ప్రశంసనీయుడన్నారు. విద్యార్థులు చిన్నతనం నుంచే తల్లిదండ్రులు, గురువులను గౌరవించడం, క్రమశిక్షణ అలవర్చుకుని బాగా చదువుకుంటే మంచి గుర్తింపుతో పాటు ఉన్నత స్థాయికి చేరుకుంటారన్నారు. మాజీ సింగిల్‌విండో అధ్యక్షుడు హేమాద్రిరెడ్డి, కరస్పాండెంట్ నాగార్జున యాదవ్, డైరెక్టర్లు సూర్యరెడ్డి, సత్యరెడ్డి, ఎమ్మార్పీఎస్ నాయకులు ఆంద్రయ్య, లక్ష్మీవేంకటేశ్వరస్వామి ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

వేటకు వేళాయె


వరుణుడి కరుణతో తుంగభద్ర నదికి జీవం వచ్చింది.. నీటి ప్రవాహంతో హొయలొలుకుతోంది.. సవ్వడి చేస్తున్న జలాల్లో అటూఇటూ తిరుగుతూ చేపలు సందడి చేస్తున్నాయి. కర్నూలు సమీపంలోని తుంగభద్ర బ్రిడ్జి వద్ద చేపల వేట ముమ్మరంగా సాగుతోంది. మత్స్యకారులు నదిలోకి గాలం వేసి..ఓపికగా నిరీక్షించి.. ఒడుపుగా చేపలు పడుతున్నారు. కొందరు యువకులు సైతం చేపల వేటలో ఉపాధిని వెతుక్కుంటున్నారు. – సాక్షిఫొటోగ్రాఫర్, కర్నూలు

వ్యక్తి అదృశ్యంపై కేసు నమోదు

కోవెలకుంట్ల: వైఎస్సార్ జిల్లా ముద్దనూరు మండలం తిమ్మాపురం గ్రామానికి చెందిన వ్యక్తి అదృశ్యంపై సోమవారం కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వరప్రసాద్ తెలిపారు. ఆయన వివరాల మేరకు.. గ్రామానికి చెందిన భీమిచెర్ల గంగాధర్‌రెడ్డికి మతిస్థిమితం సరిగ్గా లేదు. ఇటీవల కోవెలకుంట్ల పట్టణంలోని అయ్యప్పస్వామి దేవాలయ సమీపంలో నివాసం ఉంటున్న బంధువుల ఇంటికి వచ్చాడు. బయటకు వెళ్లి వస్తానని చెప్పి తిరిగి ఇంటికి రాలేదు. స్వగ్రామానికి వెళ్లి ఉంటాడని భావించి కుటుంబ సభ్యులకు సమాచారం అందించారు. అక్కడికి వెళ్లకపోవడంతో గంగాధర్‌రెడ్డి తండ్రి ప్రభాకర్‌రెడ్డి ముద్దనూరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. అక్కడి నుంచి కోవెలకుంట్ల పోలీస్‌స్టేషన్‌కు కేసును బదలాయించినట్లు ఎస్ఐ పేర్కొన్నారు.